సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 1 । జూలై । 2024



ప్రశ్నార్థకంగా 'మన బడి'
మన ఊరు–మన బడి పథకం కింద పాఠశాలల్లో చేపట్టిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. - 9లో



బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక
వరంగల్, మెదక్ జిల్లాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేశారు. - 10లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గవర్నర్‌ను కలిసిన మాజీ సర్పంచ్‌లు



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌ల సంఘం నాయకులు

భువనగిరి : రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో పలువురు తాజామాజీ సర్పంచ్‌లు కలిశారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరుకాలేదని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. అప్పులు చేసి పనులు పూర్తి చేశామని, బిల్లులు రాకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. బిల్లులు విడుదల చేయించాలని విన్నవించారు.

ప్లాట్లు కబ్జా చేశారని బాధితుల ఆందోళన



ప్లాట్ల కొనుగోలుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు చూపుతున్న బాధితులు

చౌటుప్పల్ : మండల పరిధిలోని తూప్రాన్‌పేటలో గల గ్రీన్‌సిటీ వెంచర్‌లో పాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు ఆదివారం ఆందోళనకు దిగారు. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం గ్రీన్‌సిటీ వెంచర్‌లో 2003–04లో కొందరు ప్లాట్లు కొనుగోలు చేయగా ఓ వ్యక్తి కబ్జా చేశాడు. బాధితులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించ లేదు. దీంతో న్యాయం కోసం వారంతా సంఘంగా ఏర్పడి వెంచర్ వద్దకు వచ్చారు. తొలగించిన ప్లాట్ల హద్దురాళ్ల స్థానంలో మళ్లీ రాళ్ల నాటే ప్రయత్నం చేస్తుండగా పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, బాధితుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆక్రమణదారులకు పోలీసులు అండగా ఉంటూ పేద, మధ్య తరగతి కటుంబాలకు చెందిన తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

రాష్ట్రంలో భవిష్యత్ బీజేపీదే



సమావేశంలో మాట్లాడుతున్న పాశం భాస్కర్

మోత్కూరు : రాష్ట్రంలో భవిష్యత్ బీజేపీదేనని, ఇటీవల జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన ఫలితాలే అందుకు నిదర్శనమని జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ పేర్కొన్నారు. బీజేపీ మోత్కూరు పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య భవన్‌లో ప్రధాని మోదీ మనకీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. మోసపూరిత వాగ్దానాలు చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. రూ.2లక్షల రుణమాఫీపై ప్రభుత్వం రైతులను మభ్య పెడుతుందని ఆరోపించారు. ఎమ్మెల్యేలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. నాడు సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని, నేడు సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ పశువుల సంతలో బేరగాళ్లుగా మారారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని కార్యకర్తలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుచుకోవడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య, రాష్ట్ర నాయకులు తుమ్మల మురళీధర్‌రెడ్డి, జిల్లా నాయకులు దొంతి నర్సింహారెడ్డి, నాగార్జున్‌రెడ్డి, గౌరు శ్రీనివాస్, ఏనుగు జితేందర్‌రెడ్డి, బొట్టు కృష్ణ, జక్కా మోహన్‌రెడ్డి, దయ్యాల కుమారస్వామి, జినుకల దశరథ, చాడ మంజుల, సోమేశ్వరి, రమణ, రేణుక, మరాతి అంజయ్య, బీసు మధు పాల్గొన్నారు.

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. గర్భాలయంలో స్వయంభూలకు నిజాభిషేకం, అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



యాదాద్రి ఆలయ మాడ వీధిలో కిక్కిరిసిన భక్తులు

● అలరించిన మాయాబజార్ నాటక ప్రదర్శన



యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ సన్నిధిలో ఆదివారం రాత్రి నిర్వహించిన మాయాబజార్ నాటక ప్రదర్శనలో సన్నివేశం

ఏళ్ల కల.. నెరవేరిన వేళ

1,562 మందికి పదోన్నతులు, బదిలీలు
- ఉపాధ్యాయుల్లో ఆనందం
- నేటితో ముగియనున్న ప్రక్రియ



వలిగొండ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడికి జాయినింగ్ ఆర్డర్ అందజేస్తున్న పీడీ స్వామిరాజ్

భువనగిరి : తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం తరువాత ఉపాధ్యాయుల కల నెరవేరింది. కోర్టు కేసులు ఇతరత్రా కారణాలతో అనేక మలుపులు తిరిగిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. గెజిటెడ్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు ఇప్పటికే తమకు కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరగా.. శుక్రవారం ఎస్జీటీలు బదిలీ ఆర్డర్లు తీసుకోనున్నారు.

చివరిసారి 2015లో పదోన్నతులు

ఉపాధ్యాయులకు చివరిసారి 2015లో పదోన్నతులు కల్పించారు. ఆ తర్వాత వివిధ కారణలతో ప్రక్రియ వాయిదా పడింది. అనంతరం 2018లో బదిలీలు మాత్రమే చేపట్టారు. ఈ సమయంలో కూడా వివిధ కారాణలతో ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తరువాత 2023లో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని నోటిఫికేషన్ ఇచ్చారు. ఇదే సమయంలో స్పౌజ్ కేసుల కారణంగా ఆగిపోవడంతో పాటు తమ పోస్టులు తమకే ఇవ్వాలని పండిట్‌లు కోర్టును ఆశ్రయించారు. ఈ ప్రక్రియలో బదిలీలను పక్కన బెట్టి పదోన్నతులు చేపట్టాలని భావించారు. కానీ, పదోన్నతులకు టెట్ ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన పెట్టింది. ఈ సమయంలో కోర్టు ఇచ్చిన స్టే కారణంగా 2023 సెప్టెంబర్‌లో మళ్లీ ప్రక్రియ నిలిచిపోయింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావించింది.న్యాయపరమైన చిక్కులను అధిగమించి విజయవంతంగా పూర్తి చేశారు.

పదోన్నతులు, బదిలీ అయిన టీచర్లు

జూన్ 8వ తేదీన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 30వ తేదీన ప్రక్రియ ముగియాల్సి ఉంది. కానీ, వివిధ కారణాలరీత్యా ఒక రోజు ఆలస్యంగా ఈ నెల 1వ తేదీన ఎస్జీటీల బదిలీలతో ప్రక్రియ ముగియనుంది. జిల్లాలో మొత్తం 1,562 మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరింది. ఇందులో 75 మంది జీహెచ్‌ఎంలు ఉండగా 68 మందికి బదిలీలయ్యాయి. మిగతా అన్ని కేటగిరీల్లో కలిపి 1,212 మంది ఉండగా ఇందులో 52 మందికి గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. బదిలీల్లో భాగంగా 562 మందికి స్థానం చలనం కలిగింది. అలాగే 1,452 మంది(ఎస్జీటీ, ఎల్‌పీ, పీఈటీ) ఎస్‌జీటీలు ఉండగా వీరిలో 431 మందికి ఎస్ఏలుగా పదోన్నతి లభించింది. అనంతరం ఎస్‌జీటీల్లో 449 మందికి స్థానం చలం కలిగింది.

ఒకే మండల పరిధిలోకి ఉపాధ్యాయ దంపతులు

వేర్వేరు మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ దంపతులను ఒకే మండల పరిధిలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం స్పౌజ్ అవకాశం కల్పించింది. జిల్లాలో 150 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా ఒకే మండల పరిధిలోకి వచ్చారు.

బదిలీలతో ఏర్పడ్డ ఖాళీలు 687

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసిన అనంతరం జిల్లాలో అన్ని రకాల కేటగిరీల్లో కలిపి 687 ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. కాగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ డీఎస్సీ ద్వారా కేవలం 277 ఖాళీలను భర్తీ చేయనున్నారు. వీటిలో ఎస్జీటీలు 128, ఎస్ఏలు 130, ఎల్‌పీలు 19 వరకు ఉన్నాయి.

1996 తర్వాత ఇప్పుడే పదోన్నతి



1996 డీఎస్సీ ద్వారా ఎస్‌జీటీగా ఉద్యోగంలో చేరాను. 2015లో పదోన్నతులు కల్పించినా నాకు రాలేదు. 2018లో కేవలం బదిలీలు మాత్రమే జరిగాయి. ఉద్యోగంలో చేరిన 27 ఏళ్లకు గెజిటెడ్ హెచ్‌ఎంగా పదోన్నతి లభించింది. ఆలస్యంగానైనా పదోన్నతి పొందడం ఆనందంగా ఉంది. కొందరు ఉపాధ్యాయులు పదోన్నతి పొందకుండానే ఉద్యోగ విరమణ చేశారు. – లక్ష్మినర్సింహారెడ్డి, గెజిటెడ్ హెచ్ఎం, తుక్కాపురం స్కూల్

23 ఏళ్లకు కల సాకారమైంది



స్కూల్ అసిస్టెంట్‌గా 23 ఏళ్ల క్రితం గూడూరు జెడ్పీ హెచ్‌ఎస్‌లో విధుల్లో చేరాను. పదోన్నతులు కల్పించాలని పలుమార్లు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశాం. 2015, 2018లో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టినా వివిధ కారణాలతో నిలిచిపోయింది. ఎట్టకేలకు గెజిటెడ్ హెచ్‌ఎంగా పదోన్నతి రావడం సంతోషంగా ఉంది. – బసిరెడ్డి అమృతం, గెజిటెడ్ హెచ్ఎం, రెడ్లరేపాక స్కూల్

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



2002లో డీఎస్సీ ద్వారా పీఈటీ ఉద్యోగంలో చేరాను. తొమ్మిదేళ్ల నుంచి వలిగొండ మండలం వెల్వర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న. 12 ఏళ్ల క్రితమే పదోన్నతి రావాలి. పీఈటీలను అప్‌గ్రేడ్ చేయడంతో 22 ఏళ్లకు పదోన్నతి లభించింది. దీంతో జీహెచ్‌ఎంకు అర్హత సాధించినట్లయింది. పదోన్నతులు, బదిలీలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. –గంధమల్ల స్వామిరాజు, ఫిజికల్ డైరెక్టర్, వలిగొండ జెడ్పీహెచ్ఎస్

నేను, నా భార్య ఒకే మండలానికి వచ్చాం



నేను యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించాను. నా భార్య కల్యాణి భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌జీటీగా విధులు నిర్వహించేది. వేర్వేరు మండలాల్లో విధులు నిర్వహించాలంటే ఇద్దరికి ఇబ్బంది కరంగా ఉండేది. ప్రస్తుత బదిలీల్లో నేను మాసాయిపేట నుంచి భువనగిరి మండలం బస్వాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చాను. పక్కపక్క గ్రామాలు కావడంతో ఇద్దరం ఒకే వాహనంపై పాఠశాలకు వెళ్తున్నాం. – వి.రమేష్, స్కూల్ అసిస్టెంట్, బస్వాపురం స్కూల్

2012లోనే పదోన్నతి రావాలి



2002 డీఎస్సీ ద్వారా హిందీ పండిట్ గ్రేడ్–2 ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరాను. 2012లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి రావాలి. కోర్టులో పలు రకాల కేసులు ఉండటంతో ఆగిపోయింది. 2023లో అప్పటి ప్రభుత్వం పండిట్‌లను అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.కానీ, ఎస్‌జీటీలు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం పండిట్‌లను అప్‌గ్రేడ్ చేయడంతో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. – టి.వరమ్మ,హిందీ పండిట్, దత్తప్పగూడెం స్కూల్

పది ఎకరాలకే రైతుభరోసా ఇవ్వాలి

- పంటలు సాగు చేస్తేనే వర్తింపజేయాలి
- బీడు భూములకు, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఇవ్వొద్దు
- పీఏసీఎస్ ప్రత్యేక సమావేశాల్లో అభిప్రాయాలు వెల్లడించిన రైతులు



రేణిగుంట పీఏసీఎస్‌లో జరిగిన సమావేశంలో తన అభిప్రాయాన్ని వెల్లడిస్తున్న రైతు దశరథరెడ్డి

భువనగిరి రూరల్, రాజాపేట: 'పది ఎకరాల్లోపు రైతులకే రైతుభరోసా పథకం వర్తింపజేయాలి.. అది కూడా పంటలు సాగు చేస్తేనే ఇవ్వాలి..' రూ.లక్ష వరకు ఆదాయ పన్ను చెల్లించే వారికి కూడా వర్తింపజేయాలని రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కొండలు, గుట్టలు, ప్లాట్లు, నాలా కనెక్షన్ ఉన్న భూములకు రైతుల భరోసా ఇవ్వద్దన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రభుత్వ అధికారులు, విదేశాల్లో స్థిరపడిన వారిని అనర్హులుగా ప్రకటించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పీఏసీఎస్‌లలో ఆదివారం ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశాల్లో రైతుభరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. రైతుల అభిప్రాయాలకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, రేణికుంట పీఏసీఎస్ డీసీఓ నాగమణి తెలిపారు. భువనగిరి సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి, వ్యవసాయ శాఖ సీనియర్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మి, ఏఓ పావని, ఏఈఓలు శ్రీనివాస్, మౌనిక, కీర్తన, బ్యాంకు సీఈఓ దంతూరి నర్సింహ, బ్యాంకు డైరెక్టర్ బల్గూరి మధుసూదన్‌రెడ్డి, రాజాపేటలో పీఏసీఎస్ చైర్మన్ చింతలపురి భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్, ఎంపీటీసీ దాచపల్లి రాజు, డైరెక్టర్లు జెల్ల భిక్షపతిగౌడ్, కత్తుల అంజిరెడ్డి, గుంటి కృష్ణ, రాజ్యం నర్సింహులు, మాడోతు నర్సింగ్ నాయక్, వెంకటాపురం నర్సమ్మ, ఏడీఏ పద్మావతి, ఏఓ మాధవి, ఏఈఓలు పాల్గొన్నారు.

గతంలో మాదిరిగా ఇవ్వొద్దు

గతంలో మాదిరిగా కాకుండా పది ఎకరాలలోపు సాగు భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతుభరోసా పథకం వర్తింపజేయాలి.అది కూడా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పంటలు సాగు చేసినవారికే ఇవ్వాలి.బీడు భూములకు ఇవ్వద్దు. – రావిడి దశరథరెడ్డి, రైతు, నరసాపురం, రాజాపేట మండలం

రక్షణ రంగంలో అపార అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు

- బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు

బొమ్మలరామారం : హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో విద్యనభ్యసించిన విద్యార్థులకు రక్షణ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్‌లో గల హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యతో పాటు క్రీడలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులు నిర్వహించడం హర్షించదగిన విషయమన్నారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధిస్తూ దేశానికి సేవ చేయడానికి సైనికులను అందజేస్తున్న డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాల సేవలు అభినందనీయమన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, ఓయూ ప్రొఫెసర్ రాములు, అదనపు ఎస్పీ నర్సింహారావు, ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్, తాజామాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ డాక్టర్ రాజ్‌కుమార్, డైరెక్టర్ నవ్యశ్రీ, కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, చీఫ్ డాక్టర్ ఆర్.కె.రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

- జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

భువనగిరి రూరల్: ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమిటినేటి సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భువనగిరి మండలంలోని అనంతారం, వడపర్తి, హన్మపురం, బండసోమారం గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే బండసోమారంలో రజక కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా భాగస్వాములు కావాలని, అప్పుడే గ్రామాలు, పట్టణాలు పురోగతి సాధిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సామల వెంకటేశం, వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఎలిమినేటి కృష్ణారెడ్డి, చిందం మల్లికార్జున్, కాటిక జంగయ్య, నానెం కృష్ణ, ఎంపీఓ అనురాధ, ఎంపీటీసీ ఉడుత శారద ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వరుణ పూజలు

చౌటుప్పల్ : వర్షాలు కురువాలని చౌటుప్పల్ మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామస్తులు ఆదివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిందెలతో నీటిని తీసుకువచ్చి బొడ్రాయికి జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి కరువు కాటకాలు లేకుండా చూడాలని, పాడిపంటలను కాపాడాలని దేవతలను ప్రార్థిస్తున్నారు. వానపాటలు పాడుతూ మహిళలు చుట్టుకాముడు ఆడారు. ఈ కార్యక్రమంలో మునగాల అమరేందర్‌రెడ్డి, కొత్త శ్రీనురెడ్డి, గంగనబోయిన నర్సింహ, అంజయ్య, ఉపేందర్‌రెడ్డి, రాజు, పుల్లమ్మ, మల్లమ్మ, సత్తమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ మండలం ఆరెగూడెంలో బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు



పాఠశాలల అభివృద్ధికి పీఎంశ్రీ

- జిల్లాలో 25 స్కూళ్లు ఎంపిక
- తొలి విడతలో 17, రెండో విడతలో 8
- ఒక్కో పాఠశాలకు రూ.10 లక్షల చొప్పున ఖర్చు
- కేంద్రం వాటా 60, రాష్ట్ర వాటా 40
- సమకూరనున్న అధునాతన సౌకర్యాలు

రామన్నపేట : ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాలల స్కీం కింద రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 251 పాఠశాలలను ఎంపిక చేసి మౌలిక వసతులు కల్పిస్తోంది. మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, అదనపు తరగతి గదులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు మైనర్ రిపేర్ వంటి పనులు చేపడుతున్నారు. దీనికి తోడుగా కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో భాగంగా మరో 25 పాఠశాలలను ఎంపిక చేసింది. ఇందులో తొలి విడతలో 17, రెండో విడతలో 8 పాఠశాలలు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం అమలుకానుంది.

రెండవ దశలో ఎంపికైన స్కూళ్లు

మొదటి దశలో ఎంపికైన 17 పాఠశాలల తోపాటు రెండవ దశలో మరో 8 స్కూళ్లను పీఎంశ్రీ పథకానికి ఎంపిక చేశారు. ఇందులో ఎంపీపీఎస్ కోటమర్తి, ఆలేరు బాలికల గురుకులం, భువనగిరిలోని గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చాడ ఎంపీపీఎస్, పాలడుగు ఎంపీయూపీఎస్, ఎం.తుర్కపల్లి ఎంపీయూపీఎస్, మల్లాపూర్ ఎంపీపీఎస్, భూదాన్‌పోచంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉన్నాయి.



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన రామన్నపేట మండలం వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నిధులు వీటికి ఖర్చు చేస్తారు

పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు మంజూరు చేయనున్నాయి. ఇందులో కేంద్రం వాటా 60, రాష్ట్రం వాటా 40 శాతం ఉంటుంది. ఈ నిధుల ద్వారా పాఠశాలల్లో అధునాతన ప్రయోగశాలలు, ఇంటర్‌నెట్ సౌకర్యం, డిజిటల్ బోధన, డిజిటల్ లైబ్రరీ, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా విద్యార్థులను ఫీల్డ్ ట్రిప్స్‌కు, ఎక్స్‌ప్లోజర్ విజిట్‌కు తీసుకెళ్లనున్నారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులతో అతిథి తరగతులు నిర్వహించనున్నారు. బాలికల ఆత్మరక్షణకోసం కరాటేలో శిక్షణ ఇప్పించడం, బాలికల సాధికారిత క్లబ్‌లు ఏర్పాటు చేస్తారు. ఒక్కో పాఠశాలకు ఐదు సంవత్సరాల కాలంలో విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.2 కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ప్రశ్నావళికి లభించిన పాయింట్ల ఆధారంగా ఎంపిక

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం గత విద్యా సంవత్సరం పీఎంశ్రీ పథకం తీసుకువచ్చింది. విద్యార్థుల సంఖ్య, వసతులతో పాటు ఎంపికకోసం రూపొందించిన ప్రశ్నావళికి లభించిన పాయింట్ల ఆధారంగా 25 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో భాగంగా తొలి విడతలో 17 పాఠశాలు ఎంపికయ్యాయి. వాటిలో ఆలేరు, కొలనుపాక, ఆత్మకూరు(ఎం), బస్వాపూర్, బీబీనగర్, చీకటిమామిడి, మల్కాపూర్, జూలూరు, రాజాపేట, వెల్లంకి, యాదగిరిగుట్ట (బాలికల) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గుండాల, ఎం.తుర్కపల్లి, సంస్థాన్‌నారాయణపురం, భూదాన్‌పోచంపల్లి మోడల్‌స్కూళ్లు, భువనగిరి బాలుర సాంఘిక సంక్షేమ గురుకులం, చౌటుప్పల్ బాలికల గురుకుల పాఠశాల ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో పనులు చేపట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరలో తమ వాటా నిధులు మంజూరు చేయనున్నాయి. తద్వారా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగడానికి దోహదపడనున్నాయి.

మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి



పీఎంశ్రీ పథకం గ్రామీణ విద్యార్థులకు గొప్ప వరం. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతో పాటు, మరింత మెరుగైన వసతులు, ల్యాబ్‌లు అందుబాటులోకి వస్తాయి. విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన పీఎంశ్రీ స్కీంను నూటికి నూరుశాతం సద్వినియోగం చేసుకుంటాం. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. – టి.సురేందర్‌రెడ్డి, హెచ్ఎం, వెల్లంకి

న్యూస్‌రీల్

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

భువనగిరి క్రైం: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి పక్కన గల వీరభద్ర జనరల్ స్టోర్‌లో నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.10వేల విలువ గల నిషేధిత ఆర్‌ఆర్, విమల్, ఎస్‌ఆర్ గుట్కా ప్యాకెట్లను హైదరాబాద్‌లోని బేగంబజార్ నుంచి కొనుగోలు చేసి ఇక్కడ అమ్ముతున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అరుణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

భువనగిరి క్రైం : పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన భాషబోయిన రవికుమార్ రైల్వే ఉద్యోగం చేస్తూ విధులు ముగించుకుని శనివారం రాత్రి ఇంటిముందు తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. కొద్దిసేపటి తర్వాత ద్విచక్ర వాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అది దగ్ధమైంది. ఈ మేరకు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో రవికుమార్ ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ అరుణ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

నడిగూడెం: మండల పరిధిలోని రామాపురం గ్రామానికి నరసాని లక్ష్మయ్య ఈ నెల 24వ తేదీ నుంచి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ జి. అజయ్ కుమార్ తెలిపారు. లక్ష్మయ్యకు మతిస్థిమితం సరిగ్గా లేదని, ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో అతడి అల్లుడు కాసాని నరేష్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

లక్ష్మణ్‌రావు సేవలు మరువలేనివి


లక్ష్మణరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, కుందూరు జానారెడ్డి

పెద్దఅడిశర్లపల్లి : దేవరకొండ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కటికనేని లక్ష్మణ్‌రావు సేవలు మరువలేనివని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డిలు అన్నారు. ఆదివారం గుడిపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన లక్ష్మణ్‌రావు విగ్రహాన్ని వారు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్‌గానే కాకుండా కృష్ణా జలాల సాధన ఉద్యమంలో ఆయన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు, చందర్‌రావు, ఎంపీపీ వంగాల ప్రతాప రెడ్డి, మాధవరావు, అర్వపల్లి నర్సింహా, పరమేష్ తదితరులున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు క్రాసింగ్‌లు

- మునగాల మండల పరిధిలో నాలుగు నెలల్లో 8మంది మృతి, పలువురికి గాయాలు
- సిగ్నల్స్ ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు

మునగాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డు క్రాసింగ్‌ల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మునగాల మండలంలో 25కి.మీ. పరిధిలో జాతీయ రహదారిపై ఉన్న ఏడు గ్రామాలలో ఆరు క్రాసింగులు ఏర్పాటు చేశారు. వీటిలో సగానికి పైగా అనధికారికంగా నిర్మించినవే. ముఖ్యంగా మండల కేంద్రంలో సివిల్ ఆస్పత్రి ఎదురుగా అనధికారికంగా ఉన్న క్రాసింగ్ ప్రమాదకరంగా మారింది. నెలకు ఐదారు ప్రమాదాలు ఈ ప్రాంతంలో జరుగుతూనే ఉన్నాయి. మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఉన్న క్రాసింగ్‌ల వద్ద గత జనవరి నుంచి ఇప్పటి వరకు ఆరు నెలల కాలంలో జరిగిన ప్రమాదాల్లో 8మంది మృత్యువాత పడగా 28మంది గాయపడ్డారు. ముకుందాపురం వద్ద బస్టాండ్ సెంటర్, హరిజన కాలనీ ఎదురుగా ఏర్పాటు చేసిన క్రాసింగ్‌ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై అతివేగంతో ప్రయాణించే వాహనాలు రోడ్డు దాటుతున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారులను ఢీకొట్టడంతో వారి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. నిత్యం జరిగే ప్రమాదాల వల్ల జాతీయ రహదారిపై ఉన్న గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.


ముకుందాపురం క్రాసింగ్ వద్ద లేని సిగ్నల్స్

సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

జాతీయ రహదారిపై ఉన్న డివైడర్ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే కొంత మేరకు ప్రమాదాలను నివారించే అవకాశముంది. క్రాసింగ్‌ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. మండల కేంద్రంలో దాదాపు కి.మీ. పొడవున ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసిన జీఎమ్మార్ సంస్థ కేవలం ఒక అండర్ వెహికల్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయడంతో మండల కేంద్రానికి వచ్చే ఆయా గ్రామాల ప్రజలు తప్పని పరిస్థితుల్లో క్రాసింగ్ దాటి వెళ్లాల్సి వస్తుంది. ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి


క్రాసింగ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ప్రమాదం సంభవించిన ప్పుడు సంబంధిత వాహనం ఆచూకీ దొరుకుతుంది. రహదారిపై ఉన్న గ్రామాల ప్రజలను ప్రమాదాలకు సంబంధించి చైతన్యపరచేందుకు పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టాలి. రహదారిపై హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి.
– మాధంశెట్టి మహేష్, టీసీ సంఘం నాయకుడు

మునగాల క్రాసింగ్‌ను మూసివేయాలి


మునగాల మండల కేంద్రంలో సివిల్ ఆస్పత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన క్రాసింగ్‌ను మూసివేయాలి. అనధికారికంగా ఏర్పాటు చేసిన ఈ క్రాసింగ్ వద్ద నిత్యం పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండల కేంద్రంలో మరో మినీ వీయూపీ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి.
– చింతకాయల నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు

సరస్వతీపుత్రుడికి సాయం చేయరూ..

- ఐఐటీ బాంబేలో సీటు సంపాదించిన పేదింటి బిడ్డ
- ఆర్థికసాయం కోసం ఎదురుచూపు

మిర్యాలగూడ: మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన కుంచం శివ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జనరల్ కేటగిరీలో ఆలిండియా 211వ ర్యాంకు, బీసీ కేటగిరీలో 24వ ర్యాంక్ సాధించాడు. శివ చిన్నతనంలోనే అతడి తల్లి చనిపోగా.. తండ్రి నాలుగు సంవత్సరాల క్రితం మృతిచెందారు. శివ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని పలువురు దాతలు అందించిన సహకారంతో 9, 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేసి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు సంపాదించాడు. కానీ తన ఖర్చుల నిమిత్తం కూడా శివ వద్ద డబ్బులు లేవు. దాతలు సహాయం అందిస్తే, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని తాను కూడా పేదలకు సహాయం చేస్తానని శివ వేడుకుంటున్నాడు.


కుంచం శివ

దాతలు సహాయం అందించాల్సిన వివరాలు..

కుంచం శివ
బ్యాంక్ అకౌంట్ నంబర్: 49628100018208
(బ్యాంక్ ఆఫ్ బరోడా)
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: BARB0MIRYAL
ఫోన్ పే నంబర్ : 9182871768

విద్యుదాఘాతంతో వలస కార్మికుడు మృతి

నకిరేకల్: బతుకుదెరువు కోసం వలస వచ్చిన కార్మికుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలోని సుందరయ్యనగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన నిషాద్ చంద్రశేఖర్ (34) అలియాస్ రైఫిల్ తన అన్న సుమీర్‌తో కలిసి ఇటీవలే నకిరేకల్‌లో పెయింటింగ్ పని కోసం వలస వచ్చారు. సందరయ్యనగర్‌లో కందాల భద్రారెడ్డికి చెందిన రేకుల షెడ్ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గోరఖ్‌పూర్ నుంచి వచ్చిన 15మందికి పైనే వలస కార్మికులంతా ఇదే షెడ్‌లోని ఐదు రూంల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. నిషాద్ చంద్రశేఖర్ రోజుమాదిరిగానే ఆదివారం పెయింటింగ్ పనికి వెళ్లి సాయంత్రం రూంకు వచ్చాడు. తన దుస్తులు ఉతికి దండెం తీగపై ఆరేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడ ఉన్న మిగతా వారు కర్రతో కొట్టి నిషాద్ చంద్రశేఖర్‌ను పక్కకు తప్పించారు. అపస్మారసక స్థితిలో పడి ఉన్న చంద్రశేఖర్‌ను నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు చంద్రశేఖర్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారంతా గోరఖ్‌పూర్‌లో ఉంటున్నారు. చంద్రశేఖర్ మృతిచెందిన సమాచారం వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు.


చంద్రశేఖర్ మృతదేహం

మృత్యువుతో పోరాడి ఓడిన బాలుడు

- లివర్ మార్పిడికి సహకరించని శరీరం
- ఇన్ఫెక్షన్ తగ్గకపోవడంతో తుది శ్వాస విడిచిన చిన్నారి

చౌటుప్పల్: పది రోజులుగా ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడిన తొమ్మిది నెలల బాలుడు ఆదివారం చనిపోయాడు. వివరాలు.. చౌటుప్పల్ మండల పరిధిలోని చిన్నకొండూర్ గ్రామానికి చెందిన నూనె వెంకటేశ్, రమ్య దంపతుల కుమారుడు ఆయాన్స్(09 నెలలు)కు పుట్టుకతోనే అనారోగ్య సమస్యలు తలెత్తాయి. వైద్యం చేయించడంతో కొంతమేరకు అనారోగ్యం తగ్గింది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం బాలుడికి కామెర్లు వచ్చాయి. దీంతో మరోసారి అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వివిధ రకాల పరీక్షలు చేసిన వైద్యులు బాలుడి ప్రాణాలు దక్కాలంటే లివర్ మార్పిడి చేయాలని సూచించారు. లివర్ ఇచ్చేందుకు బాలుడి తల్లి రమ్య ముందుకు వచ్చింది. కానీ ఆపరేషన్‌కు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. తమ కుమారుడి ప్రాణాలు కాపాడుకునేందు కోసం ప్లాటును సైతం అమ్మేశారు. 'ప్రాణాపాయస్థితిలో పేదింటి చిన్నారి' శీర్షికన ఈ నెల 22న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు స్పందించి ఆర్థికసాయం చేశారు. ఆపరేషన్ చేయాలంటే బాలుడి కడుపులో ఉన్న ఇన్ఫెక్షన్ తగ్గాల్సి ఉండడంతో గత పది రోజులుగా వైద్యులు వైద్యం అందించారు. ఆపరేషన్ చేసేందుకు శరీరం సహకరించక ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. వైద్యం కోసం లక్షలాది రూపాయలు అప్పు చేసి ఖర్చు చేసినా తమ కుమారుడి ప్రాణాలు దక్కలేదని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు.


మృతిచెందిన ఆయాన్స్ (ఫైల్)

డ్రగ్స్ కంపెనీలో గ్యాస్ లీకేజీ

- ముగ్గురు కార్మికులకు అస్వస్థత


కంపెనీలోని రియాక్టర్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: కంపెనీలో గ్యాస్ లీకేజీ అయ్యి ముగ్గురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఈ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నారాయణగిరి సమీపంలో గల సాయితేజ డ్రగ్స్ కంపెనీలో ఆదివారం సాయంత్రం జరిగింది. సాయితేజ డ్రగ్స్ కంపెనీలో బిహార్ రాష్ట్రానికి చెందిన మున్నలాల్, పరమేశ్వర్, దేవశారన్ పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్ర కంపెనీ గ్యాస్ లీకై ముగ్గురూ అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కంపెనీ యాజమాన్యం వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో హైదరాబాద్‌కు తరలించారు. మున్నాలాల్‌కు ఊపిరి ఆడకపోవడంతో 108 సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. విషయం తెలుసుకొన్న స్థానిక ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి కంపెనీని సందర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని అక్కడ పనిచేస్తున్న కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

మోదీ నియంతృత్వ పాలన కొనసాగుతోంది

- వీక్షణం మాసపత్రిక సంపాదకుడు వేణుగోపాల్

సూర్యాపేటటౌన్: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని వీక్షణం మాస పత్రిక సంపాదకుడు ఎన్. వేణుగోపాల్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జీవీవీ ఫంక్షన్‌హాల్‌లో డీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికలు – అనంతర పరిణామాలు – ఫాసిజం అనే అంశంపై ఆయన ఉపన్యాసం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ అంతా తానై ప్రచారం చేశారని, మోదీ తనను తాను దేవుడు పంపిన దూతను అని చెప్పుకున్నాడన్నారు. బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తాయని చెప్పుకున్నారని విమర్శించారు. మోదీ దుర్మార్గ పాలన ప్రభావానికి గురైన ప్రజలు బీజేపీకి, మోదీకి బుద్ధిచెప్పి 240 స్థానాలకే పరిమితం చేశారని పేర్కొన్నారు. స్వతంత్రంగా కాక ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల మద్దతుతో మూడోసారి మళ్లీ ప్రధాని అయ్యాడని విమర్శించారు. రచయిత, ఉద్యమకారిని అరుంధతిరాయ్‌పై 10 సంవత్సరాల క్రితం వేసిన కేసును మళ్లీ తిరగదోడి ఆమెను నిర్బంధం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మూడు వారాల్లో ఐదు రాష్ట్రాల్లో ముస్లింలపై దాడులు జరిగాయన్నారు. అనంతరం డీటీఎఫ్ జిల్లా పూర్వ అధ్యక్షుడు దశరథరామారావు ఉద్యోగ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి, ఎ. పున్నయ్య, జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య, సీహెచ్. వెంకటేశ్వర్లు, యోగానంద్, ఆనంద్ భాస్కర్, సిద్దీఖ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీక్షణం మాసపత్రిక సంపాదకుడు వేణుగోపాల్

డెంగీ విజృంభణ



- ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 38 కేసులు
- నల్లగొండ నియోజకవర్గంలోనే 20..
- దోమల వ్యాప్తితో కేసుల పెరుగుదల

నల్లగొండ టౌన్ : జిల్లాలో డెంగీ విజృంభిస్తోంది. వర్షాకాలం ఊపందుకోకముందే డెంగీ వ్యాప్తి పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. జనవరి మాసం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 38 పాజిటివ్ కేసులు నమోదు కావడం డెంగీ వ్యాప్తి ఉధృతికి అద్దం పడుతోంది. నల్లగొండ నియోజకవర్గంలోనే అత్యధిక డెంగీ కేసులు నమోదయ్యాయి. ముమ్ముందు జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కేసుల నమోదు ఇలా..

తిప్పర్తి పీహెచ్‌సీ పరిధిలో 6, నల్లగొండ మండలం రాములబండ పరిధిలో 3, కనగల్ పరిధిలో 4, మాన్యంచెల్క అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 4, పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 3, చిట్యాల, నార్కట్‌పల్లి, శాలిగౌరారం, కేతేపల్లి, దామరచర్ల, నాగార్జునసాగర్, చందంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఒకటి చొప్పున, కట్టంగూర్, హాలియా పీహెచ్‌సీల పరిధిలో రెండు చొప్పున, నిడమనూరు పీహెచ్‌సీ పరిధిలో 4 డెంగీ కేసులు నమోదయ్యాయి.

మురుగునీటి నిల్వే కారణం..

వర్షాకాలంలో ఏర్పడే నీటి గుంతలతోపాటు మురుగు కాల్వలు, ఇళ్లలో పేరుకుపోయిన నీటి తొట్లు, పగిలిపోయిన కుండలు, డ్రమ్ముల్లో నీటి నిల్వ ఉండటం వల్ల దోమల వ్యాప్తి పెరిగి డెంగీ వ్యాప్తికి దోహద పడుతున్నాయి. నీటి నిల్వ లేకుండా చూసుకునేందుకు ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామాలు, పట్టణాల్లోని వీధులను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వర్షాలకు ముందు, తర్వాత డ్రెయినేజీల్లో పూడిక తీసివేసి మురుగు సక్రమంగా పారే విధంగా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉంది. వ్యాధిపై సరైన అవగాహన కలిగి ఉండడం. దోమల పెరుగుదల అరికట్టడానికి నీటి నిల్వలు తొలగించడం. వారంలో ఒక రోజు డ్రై డేగా పాటించి పేరుకుపోయిన నీటి నిల్వలను పారబోయడం చేయడం ద్వారా డెంగీని అరికట్టవచ్చు.

పట్టించుకోని అర్బన్ మలేరియా విభాగం..

పట్టణాల్లో దోమలను నివారించడంతో పాటు డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నివారణ కోసం అర్బన్ మలేరియా విభాగం పని చేయాల్సి ఉంటుంది. ఈ విభాగంలో ఒక్క నల్లగొండ పట్టణంలోనే 60 మంది వరకు సిబ్బంది ఉన్నారు. వీరు దోమల నివారణలో పూర్తిగా విఫలమయ్యారనే అపవాదు ఉంది. దోమల నియంత్రణకు మందులు చల్లడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

డెంగీ లక్షణాలు..

అకస్మాత్తుగా ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో కూడిన తీవ్ర జ్వరం, జ్వరం తగ్గినట్లే అనిపించి వారం, పది రోజుల్లో తిరిగి రావడం, డెంగీ వైరస్ వల్ల కలిగే లక్షణం. ఎడిస్ దోమ ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాధి వ్యాప్తి చెందుతుంది. కళ్ల నొప్పి, శరీరంపై చిన్న దద్దుర్లు, డెంగీ లక్షణాలు.

సిబ్బందిని అప్రమత్తం చేశాం

జిల్లాలో డెంగీ వ్యాప్తి చెందకుండా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేశాం. అన్ని గ్రామాలు, పట్టణాల్లో మురుగునీటి గుంతల్లో దోమల నివారణకు మందులను స్ప్రే చేయాలని ఆదేశాలిచ్చాం. ప్రజలు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. డెంగీ లక్షణాలు కనపడితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలి. వైద్యుడిని సంప్రదించాలి.
– డాక్టర్ కళ్యాణచక్రవర్తి, డీఎంహెచ్‌ఓ

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

పెద్దఅడిశర్లపల్లి: మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంచమ బొడ్రాయి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ ఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవీరెడ్డి దంపతులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కల్యాణోత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఆర్థిక బాధ్యతల్లో వద్దు

- రెవెన్యూ విధుల నుంచి ఔట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు
- రెగ్యులర్ ఉద్యోగులకు అప్పగింత
- ఇతర విభాగాల్లోకి ఔట్ సోర్సింగ్ సిబ్బంది
- ఆర్థిక అవకతవకలు జరగకుండా మున్సిపల్‌శాఖ జాగ్రత్తలు


నల్లగొండ మున్సిపల్ కార్యాలయం

నల్లగొండ టూటౌన్ : మున్సిపల్ కార్యాలయాల్లో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఆ బాధ్యతల నుంచి తప్పించాలని డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) ఆదేశాలు జారీ చేసింది. ఈ విభాగంలో ముఖ్యమైన ఆస్తి పన్ను వసూలులో అవకతవకలకు పాల్పడితే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నుంచి రికవరి సాధ్యం కాదనే విషయాన్ని పరిగణనలోని తీసుకున్నట్లు తెలుస్తోంది. రంగారెడ్డి జిల్లాలోని ఓ మున్సిపాలిటీలో జరిగిన అక్రమాలతోనే మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది. రెవెన్యూ విభాగంతో పాటు ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అన్ని విభాగాల నుంచి వారిని తప్పించాలని మున్సిపల్ ఉన్నతాధికారులు ఇటీవల సర్క్యులర్ జారీ చేశారు. దీంతో వారి స్థానంలో రెగ్యులర్ ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగిస్తున్నారు.

జిల్లాలో 46 మంది..

జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, హాలియా, దేవరకొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్ మున్సిపల్ కార్యాలయాల్లో రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న 46 ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తప్పించి ఇతర విభాగాల్లోకి పంపారు. ఆయా విభాగాల్లో గతంలోనే మున్సిపల్ కార్యాలయాలకు కేటాయించిన వీఆర్‌ఓలను ఆస్తి పన్ను వసూలు, భవనాలను మదింపు చేయడానికి ఇన్‌చార్జి బిల్ కలెక్టర్లుగా నియమించారు. రెగ్యులర్ సిబ్బంది అందుబాటులో లేని మున్సిపల్ కార్యాలయాల్లో వార్డు ఆఫీసర్లకు బాధ్యతలు అప్పగించాలని డీఎంఏ అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఆర్థిక లావాదేవీలు జరిగే కార్యకలాపాలకు సంబంధించిన పనులు అప్పగించవద్దనే విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు.

తప్పించిన ఔట్ సోర్సింగ్ సిబ్బంది..

నల్లగొండ	11
మిర్యాలగూడ	05
హాలియా	07
నకిరేకల్	04
దేవరకొండ	09
చిట్యాల	05
చండూరు	05
మొత్తం	46

రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు


ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తప్పించి రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాం. వార్డు ఆఫీసర్లతో పాటు గతంలో వీఆర్వోలుగా వచ్చిన వారిని రెవెన్యూ విభాగంలో నియమించాం.
– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

సరిపడా లేని రెగ్యులర్ సిబ్బంది

జిల్లాలో 8 మున్సిపాలిటీలు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన నందికొండ మున్సిపాలిటీలో ఇప్పటి వరకు ఇంకా ఆస్తి పన్ను మదింపు చేపట్టలేదు. మిగతా ఏడు మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూలు చేయడానికి, భవనాలు మదింపు చేయడానికి సిబ్బంది అవసరం ఉంటారు. కానీ కొన్ని మున్సిపల్ కార్యాలయాల్లో తగినంత మంది రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో ఔట్ సోర్సింగ్ సిబ్బందితోనే పని చేయించుకుంటున్నారు. హాలియా, చండూరు, నకిరేకల్ మున్సిపాలిటీల్లో సరిపడా రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సివస్తోంది. పెరుగుతున్న పట్టణ విస్తీర్ణం, భవనాల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగులను కూడా నియమించాల్సిన అవసరం ఉంది.

ఆస్తి పన్నుపై ప్రభావం పడే అవకాశం

మున్సిపాలిటీలకు కీలక ఆదాయ వనరైన రెవెన్యూ విభాగంలో పూర్తి అవగాహన కలిగిన ఉద్యోగులు ఎంతో అవసరం. రెగ్యులర్ ఉద్యోగులు అయినా, ఔట్ సోర్సింగ్ సిబ్బంది అయినా ఆస్తి పన్ను మదించడం, వసూలు చేయడం వంటి వాటిపై అవగాహన లేకపోతే.. ఆదాయ వనరుపై ఎఫెక్ట్ పడే అవకాశం ఉంటుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. కొత్తగా రెవెన్యూ విభాగంలోకి తీసుకున్న వారికి అవగాహన కల్పిస్తేనే ఆస్తి పన్ను సకాలంలో వసూలు చేయడానికి వీలవుతుందని అంటున్నారు.

ఓవర్ లోడ్‌తో టిప్పర్లు

కొండమల్లేపల్లి : గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలోని కుంట నుంచి టిప్పర్లలో నల్లరేగడి మట్టిని కొండమల్లేపల్లి మీదుగా ఇబ్రహీంపట్నం తరలిస్తున్నారు. కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే సంతకు వ్యాపారులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఓవర్ లోడ్‌తో రేగడి మట్టిని నింపుకొని టిప్పర్లు వెళ్తుండడంతో మట్టి పెల్లలు కూలి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడితో పోలీసులు తనిఖీల సమయంలో టిప్పర్లను విడిచిపెడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై మైనింగ్ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.


మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్

రైతు భరోసాను జమ చేయాలి

హాలియా : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాపై విధివిధానాలను ప్రకటించి రైతుల ఖాతాలో డబ్బులను వెంటనే జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హాలియాలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతు భరోసాను ఎకరాకు రూ.7500 ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇప్పుడు డబ్బులు ఇవ్వని కారణంగా రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాసంపదైన బొగ్గు గనులను వేలం వేయడం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందన్నారు. బొగ్గు గనుల వేలాన్ని వెంటనే ఆపాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జూలై 8న నిడమనూరు మండల కేంద్రంలో నిర్వహించనున్న పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కున్‌రెడ్డి నాగిరెడ్డి, సీహెచ్.లక్ష్మీనారాయణ, కొండేటి శ్రీను, అవుతా సైదయ్య, దుబ్బ రామచంద్రయ్య, దైద శ్రీను, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, వేములకొండ పుల్లయ్య, రవినాయక్, వెంకన్న తదితరులు ఉన్నారు.


హాలియాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిగొండ సుధాకర్‌రెడ్డి